పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీకి శుభాకాంక్షలు



జోనల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బండి రమేష్, సత్యం శ్రీరంగం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఏర్పాటు చేసిన నూతన పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌లను శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ కమిటీ గౌరవ అధ్యక్షుడు పి. ఇశ్రాయేలు, ప్రెసిడెంట్ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్స్ దేవదాస్, ఎంపీ రాజు, సీహెచ్. ఫిలిప్, సునీల్ మోదీ, జనరల్ సెక్రటరీ జాషువ, సహాయ కార్యదర్శి గోపి, నిర్వహణ కార్యదర్శి ఎం.సత్యరాజు, కోశాధికారి ముఖేష్, సహాయ కోశాధికారి ఎల్.జాన్ ఆంథోని, ఎగ్జిక్యూటివ్ మెంబర్, సలహాదారులు, తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌ను శుక్రవారం కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని నాలాల కబ్జా, స్థానిక సమస్యల గురించి కమిషనర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, నాయకులు తూము వేణు, యాదగిరి, గోపిశెట్టి రాఘవేందర్, సయ్యద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



వివేకానందనగర్‌లో నివాళులర్పిస్తున్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్



యువజన దినోత్సవం

మీ స్ఫూర్తి అమరం..

మీ ప్రసంగాలు అజరామరం

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

మందలో ఒకడిగా ఉండకు.. వందలో ఒకడిగా ఉండటానికి ప్రయత్నించు! కెరటం నా ఆదర్శం.. లేచి పడుతున్నందుకు కాదు.. పడినా లేస్తున్నందుకు.! లేవండి... మేల్కొనండి.. మీ గమ్యం చేరే వరకు విశ్రమించకండి.! నేను ఏమీ చేయలేను.. నా వల్ల కాదు.. ఈ సమాజం ఇంతే అనుకుంటూ నిరాశ నిస్పృహలో ఉండే వారిలో అనుకున్నది సాధించాలనే ఆశను రేకెత్తిస్తాయి స్వామి వివేకానంద చేసిన ప్రసంగాలు. ఇనుప కండలు.. ఉక్కు నరాలు.. వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి ఎంతో అవసరం! అంటూ స్వామి వివేకానంద యువతను మేల్కొల్పడానికి ఎన్నో ప్రసంగాలు చేసి యువతకు మార్గదర్శిగా నిలిచారు. అందుకే భారత ప్రభుత్వం స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించింది. శుక్రవారం జోన్ పరిధిలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, మేధావులు స్వామి వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులపర్పించారు. ప్రపంచానికి భారతదేశ గొప్పదనాన్ని చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం

కూకట్‌పల్లిలోని వివేకానందనగర్‌లో.. నివాళులర్పిస్తున్న మాధవరం కాంతారావు





శ్రీవివేకానందనగర్‌లో నివాళులర్పిస్తున్న మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, నేతలు



హస్మత్‌పేట చౌరస్తాలో బీజేపీ అధ్యక్షుడు సంతోష్‌గౌడ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు



ప్రశాంత్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న ట్వింకిల్ స్టార్ స్కూల్ కరస్పాండెంట్ విజయలక్ష్మి, డైరెక్టర్ డా. గోకుల్, స్థానికులు

ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివి



జగద్గిరిగుట్ట చౌరస్తాలో ఇందిరాగాంధీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట చౌరస్తాలో శుక్రవారం దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కాంస్య విగ్రహాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశానికి ఇందిరాగాంధీ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం వల్లే తెలంగాణలోని మారుమూల పల్లెల్లో పేదలకు ఇళ్లు వచ్చాయన్నారు. గిరిజనులు, దళితులు, పేదలకు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను అందజేసి చరిత్రలో నిలిచిపోయారన్నారు. మెదక్ ఎంపీగా ఎన్నికైన ఆమె గతంలో బీహెచ్‌ఈఎల్, ఆర్డినెన్స్, బీడీఎల్ లాంటి సంస్థలను నెలకొల్పారన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హనుమంత్‌రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నర్సారెడ్డి భూపతిరెడ్డి, విగ్రహ దాత జెరిపేటి జైపాల్, రఘునందన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, మహిపాల్ యాదవ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సీపీఐ కార్యదర్శి ఏసురత్నం, బాషిపాక నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదు కావాలి



గొట్టిముక్కల పాండురంగారావు

కూకట్‌పల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని పట్టభద్రుల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గొట్టిముక్కల పాండురంగారావు పేర్కొన్నారు. త్వరలో నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తున్నాయని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓటు హక్కును సంబంధిత ఎంఆర్‌ఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. గతంలో ఓటు హక్కు ఉన్న వారు కూడా తప్పకుండా తిరిగి నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 2020 నవంబర్‌లోపు డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు వేసే అర్హత ఉంటుందన్నారు. మీ ఓటు హక్కును వినియోగించుకొని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు.

భాషా పండితుల సమస్యలను పరిష్కరించండి



రాష్ట్ర సభాపతి గడ్డం ప్రసాద్‌ను కలిసిన ఉపాధ్యాయ పండి పరిషత్ నాయకులు

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండి పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సభాపతి గడ్డం ప్రసాద్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు విద్యాశాఖలో ఉన్న పలు సమస్యలను ఆయనకు వివరించారు. రాష్ట్రంలో భాషా పండితులు ఉద్యోగం పొంది 20 ఏళ్లు అయినా ఇప్పటి వరకు పదోన్నతులు రాలేదన్నారు. పదోన్నతులకు సంబంధించి ఎన్నో జీవోలు విడుదల య్యాయని కాని అమలుకు నోచుకోదని తెలిపారు. కొత్త ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని భాషా పండితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి వీఎస్ఎస్ శర్మ, చింతల రాజశేఖర్, చిన్న లక్ష్మప్ప, లక్ష్మీనారాయణ, ఎండీ హమీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మోతీనగర్ చౌరస్తాలో పీజేఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం తదితరులు



ఘనంగా పీజేఆర్ జయంతి వేడుకలు



మూసాపేట వడ్డెర బస్తీలో...

కూకట్‌పల్లి: మాజీ సీఎల్‌పీ నేత, దివంగత పి. జనార్దన్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఆయన విగ్రహాల వద్ద శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పేదలకు పీజేఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పేదల పక్షపాతిగా తన ముద్రను ఏర్పర్చుకున్నారని అన్నారు. నేటి తరం రాజకీయ నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు, కార్మికులకు అండగా ఉన్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. చివరి క్షణం వరకు ప్రజా సంక్షేమం కోసం పరితపించిన పీజేఆర్ ప్రజా హృదయాల్లో చిరస్మరణీయంగా గూడు కట్టుకున్నారన్నారు.



భాగ్యనగర్ కాలనీలో పీజేఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

బస్తీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం

కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



ఎల్బీనగర్ అసోసియేషన్ సమావేశంలో మహిళలతో మాట్లాడుతున్న కార్పొరేటర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఉన్న బస్తీల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తక్షణమే పరిష్కారించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శుక్రవారం ఎల్బీనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీబాలాంజనేయ స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానికులు కార్పొరేటర్‌కు సమస్యలను వివరించారు. రోడ్డుకు అడ్డగా వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించడం, విద్యుత్ స్తంభాలు, కేబుల్ వైర్లను మార్చడం వంటి పనులు చేపట్టాలని కోరారు. వెంటనే ఆయన అధికారులకు ఫోన్ చేసి బస్తీల్లో నెల కొన్న సమస్యలను పరిష్కారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల హరినాథ్, లలిత, ఉదయ్‌యాదవ్, వాసు, రాంచందర్, వేంకటేష్, దేవి, మల్లమ్మ, నిర్మల, స్వామిగౌడ్, చందుయాదవ్, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకలు..
రంగురంగుల ముగ్గులు



మూసాపేటలోని ప్రగతినగర్ సాయి విద్యానికేత్ స్కూల్‌లో సంక్రాంతి సంబురాల్లో విద్యార్థినులు

మూసాపేట: మూసాపేట డివిజన్ పరిధిలోని పలు పాఠశాలల్లో శుక్రవారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగవల్లులు వేశారు. సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నారు. చిన్నారులకు ఉపాధ్యాయులు భోగి పళ్లు పోశారు.

బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో..

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీ బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో బ్రహ్మకుమారిలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోటీలు

కూకట్‌పల్లి: దివంగత మాజీ సీఎల్‌పీ నేత పి.జనార్దన్‌రెడ్డి జయంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని ముగ్గులను పరిశీలించారు. ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు అందజేశారు. అదే విధంగా పాల్గొన్న మహిళలకు కన్సోలేషన్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్, అరవింద్‌రెడ్డి, రాజేష్, ఫణి, ప్రవీణ్‌కుమార్, రజిత, రేష్మ, మారుతి, వాణి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



పంచశీల స్కూల్‌లో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న పాఠశాల చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు



యాదవబస్తీలోని పంచశీల స్కూల్‌లో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నేడు సంక్రాంతి వేడుకలు

మోతీనగర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జరుపుకునే ఉత్సవాల్లో సంక్రాంతి పండుగ ఒకటి. ఈ సంక్రాంతి పండుగను 13 శనివారం ఉదయం 8.30 గంటలకు మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.



బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న హరివర్ధన్ రెడ్డి, బండి రమేష్, కాంగ్రెస్ నాయకులు

'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 'ఫేర్‌వెల్ టు ఫియర్' అనే అంశంపై సీనియర్ రాజయోగటీచర్, కార్పొరేట్ ట్రైనర్ బీకె అంజలి ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

హఫీజ్‌పేట్‌లో రామయ్య అక్షింతల వితరణ

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో శ్రీ అయోధ్య రామయ్య అక్షింతలు వితరణ శుక్రవారం శ్రీ హనుమాన్ మందిరం నుంచి హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామభక్తులతో కలిసి బోయిని అనుషా మహేష్ యాదవ్, గ్రామస్తులు కలిసి ఇంటింటికి తిరుగూ అయోధ్య రామయ్య అక్షింతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బోయిని మహేష్ యాదవ్, యాదగిరి గౌడ్, నరేందర్, గౌతమ్, మల్లేష్, జితేందర్, వెంకటేష్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిర్లా ప్లానిటోరియం సందర్శన

రాయదుర్గం: నగరంలోని బిర్లా ప్లానటోరియంను గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. 'పీఎం శ్రీ ప్రోగ్రామ్' కింద విద్యార్థులకు జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని విద్యాలయ నుంచి ప్రత్యేక వాహనాల్లో ప్లానిటోరియంను చేరుకొని అక్కడి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. దాని ప్రత్యేకత వివిధ అంశాలపై తమకున్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రొఫెసర్‌కు జార్జ్ వాట్సన్ విజిటింగ్ ఫెలోషిప్

రాయదుర్గం: హెచ్‌సీయూ సీనియర్ ప్రొఫెసర్ వినోద్ పవరాలకు అరుదైన గౌరవం లభించింది. క్వీన్స్‌లాండ్ విశ్వవిద్యాలయంలో 2024 జార్జ్ వాట్సన్ విజిటింగ్ ఫెలోషిప్‌ను పొందారు. బ్రిస్బేన్ లోని స్కూల్ కమ్యూనికేషన్‌లోని స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్ జార్జ్ వాట్సన్ విజిటింగ్ ఫెలోషిప్–2024కు ఆయన ఎంపికయ్యారు.

రక్తదానం అన్ని దానాల కంటే మిన్న

రాయదుర్గం: రక్తదానం అన్ని దానాల కంటే మిన్న అని, యువత రక్తదాన చేయడానికి స్వచ్ఛందంగా ముందుకురావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ సూచించారు. బీజేవైఎం శేరిలింగంపల్లి నాయకుడు అమర్ యాదవ్ ఆధ్వర్యంలో రాయదుర్గంలో రక్తదాన శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు రక్తదాతలను అభినందించారు. ఆతర్వాత మాట్లాడుతూ ప్రతియేటా ఔత్సాహిక యువత రక్తదానం చేయడంపై ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దని, భయం వీడాలని సూచించారు.

ఆకట్టుకున్న 'పాటరీ మేకింగ్' వర్క్‌షాప్

రాయదుర్గం: విద్యార్థులను చదువుతోపాటు ఇతర రంగాలలో రాణించేలా చేయడంలో కేంద్రీయ విద్యాలయాలు ఎంతో కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా పీఎంశ్రీహ్యాండ్స్ కార్యక్రమం కింద 'పాటరీ మేకింగ్ వర్క్‌షాప్'ను శుక్రవారం గచ్చిబౌలి జీపీఆర్ఏక్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుండల తయారీలో నిష్ణాతుడైన జయప్రకాశ్ వావిలాల ఆధ్వర్యంలో విద్యాలయలో 6వ తరగతి ఏ,బీ,సీ సెక్షన్లకు చెందిన 150 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మట్టితో వివిధ ఆకృతులను తయారీ చేసి విద్యార్థులకు ఆయన చూపించారు. అనంతరం విద్యార్థుల చేత కూడా మట్టితో వివిధ ఆకృతులను తయారు చేసేలా ఆయన ప్రోత్సహించారు.

ఘనంగా హిందీ దినోత్సవం

హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని మహిళా దక్షత సమితి విద్యాసంస్థల ప్రాంగణంలో ప్రపంచ హిందీ దినోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండర్ ఆర్ట్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుష్మాదేవి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశంలో హిందీలో మాట్లాడేవారు, భాషా ప్రాముఖ్యత పెంచేవారు తగ్గరని అన్నారు. భవిష్యత్‌లో ప్రపంచం హిందీమయం అవుతుందన్నారు. అనంతరం ఎండీఎస్ అధ్యక్షురాలు డా.సరోజ్‌బజాజ్ చేస్తున్న సేవలు కొనియాడారు.

ఐటీ ఉద్యోగి ఆత్మహత్య

మాదాపూర్: వ్యక్తిగత కారణాల వల్ల ఓ ఐటీ ఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై బాలరాజ్ తెలిపిన మేరకు.. మాదాపూర్‌లోని సాయినగర్‌లో నివాసం ఉంటున్న జగదీశ్(23) స్నేహితులతో కలసి ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. ఉదయం 9.30గంటలకు తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన స్నేహితుడు బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులకు చీరల పంపిణీ



కూకట్‌పల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా బాలాజీనగర్‌లోని జీహెచ్‌ఎంసీ కార్మికులకు కూల్ ఎవరెస్ట్ ఐస్‌క్రీం అధినేత యక్కంటి వెంకటరెడ్డి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌రెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు సమాజ అభివృద్ధికి పాటుపడాలి



వీ టీమ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మస్తాన్‌రెడ్డిని సన్మానించిన సభ్యులు

మోతీనగర్: స్వచ్ఛంద సంస్థలు సమాజ అభివృద్ధికి పాటుపడాలని అల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ కో–ఆర్డినేటర్ తిమ్మారెడ్డి వీరారెడ్డి పేర్కొన్నారు. శ్రీవివేకానందనగర్‌లో వీ టీం స్వచ్ఛంద సేవా సంస్థ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఎంతో మంది యువకులు ఈ సంస్థలో చేరి స్వచ్ఛందంగా పని చేయడం గొప్ప విషయమన్నారు. శుక్రవారం వీ టీమ్ అధ్యక్షుడు టి. మస్తాన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాయితి యాదవ్‌రెడ్డి, గోనెల సుదర్శన్ ముదిరాజ్, బంధు హరికృష్ణ, అంకం రావు, చెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మోతీనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మాజీ కౌన్సిలర్ సీఎస్ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట కమ్యూనిటీహాల్‌లో ఏజీఐ గ్రీన్ ప్యాక్, ఏజీఐ గ్యాస్ ఫ్యాక్టరీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు బసవయ్య, మాణిక్‌రెడ్డి పర్యవేక్షణలో మధుమేహం, బీపీ, చర్మ, దంత, చెవి, ముక్కు, కాళ్లు, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ సిబ్బంది నాయుడు, శ్రీనివాస్, స్థానిక నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి బాలరాజు, శివ, డి. యాదగిరి యాదవ్, కోటిరెడ్డి, వీరస్వామి, లక్ష్మయ్య, శివాజీ, దేవేందర్ పాల్గొన్నారు.



అవంతినగర్ తోట కమ్యూనిటీహాల్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు